చూసిన కుర్రవాడు నెమ్మదిగా వెనకకు తిరిగి, తలుపుమూసి గప్, చిప్ మని ఊరుకున్నట్లయితే పరిస్థితులంత తారుమారయ్యేవి కావు. కాని ఈ పిల్లవాడు యేం చేశాడంటే, ఒక్క పొలికేక వేసి లోపలికి పరుగెత్తాడు. పరుగెత్తినవాడు ఊరుకున్నాడా? ఆ యువకుని మీదపడి, పెద్దపెద్ద కేకలువేస్తూ నాలుగు దెబ్బలు వీపుమీదా, తలమీదా కొట్టి అతడి మొహమంతా రక్కేశాడు.

వాళ్ళిద్దరూ చాలా ఆశ్చర్యపోయారు. ఆ యువకుడన్నాడు కదా, 'ఇదేమిటి? ఈ కుర్రవాడి కిదేమయినా పిచ్చా?' అని. అల్లాగ అంటూనే ఆ యువతి కేసి చూసి, ఒక్క చిరునవ్వు నవ్వాడు. 'అవును! ఇదేదో పిచ్చిలాగానే వున్నది' అని ఆవిడ కూడా ఒక్క చిరునవ్వు నవ్వింది. అతను మళ్ళీ నవ్వాడు. ఇద్దరూ తెగ నవ్వుకున్నారు పిచ్చివాళ్ళ మాదిరి.

ఈసారి నవ్వులకు పిల్లవాడు చాలా సిగ్గుపడి పోయాడు. ఆ కుర్రవాడు ఇక అక్కడ నిలబడలేదు. సరాసరి గదిబయటికి వచ్చేశాడు. ఇంకా వాళ్ళ నవ్వులు అతడికి వినిపిస్తూనే వున్నవి 'ఛీ! ఇదేమి రోష్టు?' అని అనుకున్నాడో యేమిటో, అతడక్కడ ఆగలేదు గేటు దాటి ఇంటిబయటకు వచ్చాడు. రోడ్డుమీదకు వచ్చేవరకూ కూడా ఆ యువకుని నవ్వు అతని చెవులకు నెమ్మదిగా వినిపిస్తూనే వున్నది.

ఇక కుర్రవాడు పరిగెత్తడం మొదలు పెట్టాడు. ఆ రాత్రివేళ. ఈసారి యెక్కడకు? రైలుస్టేషనుకేసి కాదు- రైలుపట్టాలకేసి!

# సనాతన ధర్మం

అవసరాల రామకృష్ణారావు

"ఇరవైమూడో ఏడు కూడా దాటిపోతున్నది; నాకూ ఎన్నాళ్లీ యీ బ్రహ్మచర్యం? వచ్చిన సంబంధమల్లా వెళ్లగొట్టేస్తున్నావు. నీ పెళ్ళి చూస్తేగాని యీ ముసలి ప్రాణం పోదు- ఏదో సంబంధం అంగీకరించు నాయనా?"

"చాల్లేవే అమ్మా, అనుభవించినా నీకింకా అనుభవం రాలేదు; ఇద్దరూ కోడళ్లూ యింట్లో పెట్టిన అల్లరీ, చేసిన ఎడబాటులూ అన్నీ నిముషంలో మరచిపోతావు. ఆడది అత్తారింటికి రాగానే ఏదో అధికారం తెచ్చుకున్నాననుకుంటుంది కాబోలు."

"తప్పు. అందరి ఆడాళ్ళనీ అలా అనకు నాయనా? నాఖర్మం కాలి, నాకిలాంటి కోడళ్ళు సంభవించారు గాని. లోకమంతా అలాగే ఉంటుందా? వాళ్ళ జానకి చూడు- అత్తామామలకి ఎంత అణకువగా ఉంటోందో?- పెళ్లాం ఎలాంటిదయినా అదుపాజ్ఞలలో పెట్టుకోకపోవడం మొగాడి తప్పుగాని. రాగానే నమస్కారం చేసి నెత్తిమీద కెక్కించి, దిగమంటే మాత్రం అది దిగుతుందా?"

"ఏమోనమ్మా, అందరూ ముందు అలాగే అనుకుంటారు. తీరా ఆ సౌందర్యం, ఆ మాటలూ, ఆ నటనా చూసి తెలియకుండా తల్లినే గాదు ప్రపంచాన్నే మరచిపోతారు. నువ్వే చెప్పు, కోడలు వస్తే నాకూ నీకూ యీ చనువూ, స్వాతంత్ర్యం ఉంటుందా?"

"చేతకాకపోతే సరి."

"ఇందులో చాతగాని దేముందమ్మా, చిన్నన్నయ్య పెళ్ళిదాకా ఏమన్నాడు?" అమ్మా! యిదిగో నీ కోడలు, నీకంటే చక్కటి శిక్షణా, ప్రేమా ఎవరూ యివ్వలేరు-" అని నీ కప్పజెప్పడా! ఆఖరికి భార్య మాటలు విని మొహామొహాలు చూచుకోకుండా యింటిపట్టున వుండకుండా తను నీకు దూరమయ్యేడా లేదా?"

"అదేనోయ్ నాయనా నేనూ అనేది. ప్రతి వ్యక్తికీ ఓవ్యక్తిత్వం, స్వాతంత్రం అంటూ

వుంటాయమ్మా? అదే అబ్బురే, కాస్త ఉపయోగించుకుని తల్లి నెలా చూడాలో, పెళ్ళాన్నెలా చూడాలో కాస్త గమనించి నడుచుకోవాలి. కబుర్లు చెప్పినట్టు కాదు."

"ఆ అన్నయ్యలకు తమ్ముణ్ణి కాదా నేను! తీరా ఆదేవచ్చి నేనూ దాని మాయలో బడితే నీకేం దారి? ఎందుకమ్మా, నీ తదనంతరంగాని నేను పెళ్ళి చేసుకోను."

"అలా అయితే యీ వాళే నేను ఏనుయ్యో గొయ్యో చూసుకోవలసి వుంటుంది. అంత బలహీనుడివి అయితే, ఏ మాయలాడికోనో అడ్డులేకుండా పోయిగావుండు. అంతే కాని నాకోసం పెళ్ళిమానుకోకు. నీ వెర్రిత్యాగానికి సంతోషించాం కాని, ఊరులో ఎవరేనా విని నవ్వి పోగలరు."

* * *

జనార్దనంగారు ఆ వూళ్ళో రిటైర్డు సబ్ కలెక్టరు. ఆయనికి ముగ్గురు కొడుకులు. వేణూ, సీనూ, వాసులు. పెద్దకొడుకు లిద్దరూ పూర్తిగా భార్యలకు లోబడిపోయి, తల్లితో దెబ్బలాడి వేరే కాపురాలు చేస్తున్నారు. వాసు మొదట పెళ్ళికి ఒప్పుకోకపోయినా, తల్లి బలవంతంమీద కాదన లేకపోయాడు.

వాసుదేవరావు క్రొత్త పద్ధతులు ఆరంభించాడు. పెళ్ళిచూపులకు వచ్చిన పిల్లతో నిర్మొహమాటంగా "అమ్మాయ్, నీతో మాట్లాడాలి ఓమారు యిలా వస్తావా?" అనే వాడు. సగం మంది పిల్లలు సిగ్గుపడి తప్పుకొనేవారు. కొందరు పిల్లల తండ్రులు పెళ్ళయినా కాకుండా మాట లేమిటని మూతి విరచేవారు. ఓనాడు ఓ నల్లని పిల్ల వాసుమీదమీదకు వచ్చి "ఏమిటండి ఆ కబురు?" అని కొట్టినట్టు అడిగింది. వాసు పావు గంటకు తేరుకొని "మా అమ్మకంటే అభిమానంగా కోడళ్ళని చూసే మనిషి యీ ప్రపంచంలో లేదు. ఆమెకు అనుగుణంగా మసులుతే, నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు. మాట పూర్తి కాకుండానే ఆపిల్ల కోపంగా చూస్తూ చివాలున వెళ్ళిపోయింది.

అందరి దారివేరు. సావిత్రి విషయమే వేరు. ఆమె తెల్లని కళ్ళూ, నల్లని కళ్ళూ అతన్ని చూస్తూండగా మాయలోకి లాగేశాయి. ఆ మాటలో చాతుర్యం, పాటలో మాధుర్యం 'అడుగవలసిన ప్రశ్నే మిటి?' అన్న మాటే మరపించాయి. వెంటనే పెళ్ళికి ఒప్పుకున్నాడు. సావిత్రి తప్ప యీ ప్రపంచంలో అతనికి రెండో మనిషే కనిపించడం లేదు!

సావిత్రి కాపురానికొచ్చిన మొదటి రోజే జనార్దనంగారికి మామూలుగా ఉన్న గుండె నొప్పి కాస్త ఎక్కువైంది. "డాక్టర్ని పిలవరా వాసూ! మీ మామగారికి జబ్బుగా వుంది. నేను కని పెట్టుకు ఉండాలి, కాస్త వంటసాయం చెయ్యవే సావిత్రి తల్లీ!" అన్నది సీతమ్మ. "డాక్టర్ని పిలవడానికి నే నేమీ నౌకర్ని గాను, వంట చెయ్యడానికి అది దాసీ కాదు!" ఇద్దరి బదులు వాసే జవాబు చెప్పేడు. మరు క్షణంలో సావిత్రీ వాసూ చకచక మేడఎక్కి, తలుపేసుకున్నారు!

సీతమ్మ నిర్ఘాంత పోయింది! క్షణందాకా ఆమె నోటంట మాటే రాలేదు! ఈ మాటలూ, యీ చేష్టలూ తన కొడుకు వాసువేనా? ఆమె మాతృహృదయం దెబ్బతింది. ఏమనుకుందో, అర గంటలో సామానంతా సర్దేసింది. జనార్దనం గారిని చెయ్యిపట్టుకు లేవదీసి 'అయింది చాలు, లేవండి...అయిన అనుభవం చాలు...పిల్ల చక్కగావుందని చేసానుగాని. నిర్మలమైన నదిలో సుడి గుండాలు ఉంటాయనుకో లేదు!... మీకు వచ్చే పింఛను రాళ్ళు మనం బతకడానికి చాలక పోవు! పదండి" ఇద్దరూ బండిఎక్కి కూర్చున్నారు.

"ఛీ యీ లోకంలో మొగాళ్ళంతా ఆడాళ్ళకు దాసులే?" అంది. సీతమ్మ. వెంటనే జనార్దనం గారు

"నిజమే! కాదని ఎవరన్నారు? ఇంట్లో నీ మాటతప్ప నామాట వినబడేదా? నీ మాట ఎన్నడేనా జవదాటానా సీతా!" అన్నారు చటుక్కున. సీతమ్మ వెలవెల బోయింది!